
ఆంధ్రజ్యోతి

రంజాన్ వేళలు | ఇఫ్తార్: 6.33 | సహర్: 4.57 (శుక్రవారం)

ANDHRAJYOTHY



నల్లగొండ

5

గురువారం 21 మార్చి 2024

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	:18004251442
యాదాద్రి	:1800 425 7106
సూర్యాపేట	:1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 65

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.126	183	208
సూర్యాపేట	రూ.120	180	210
నల్లగొండ	రూ.126	184	210

ఉష్ణోగ్రత గరిష్ఠం 36.0 , కనిష్ఠం 23.4

స్తంభోద్భవుడి సన్నిధిలో..



యాదగిరిగుట్ట కొండపైన విష్ణుపుష్కరిణిలో చక్రతీర్థ స్నానం నిర్వహిస్తున్న ఆలయ అర్చకులు, వేదపండితులు

వైభవంగా చక్రతీర్థ స్నానం

- యాగశాలలో శాస్త్రోక్తంగా మహాపూర్ణాహుతి
- కొండపైన విష్ణుపుష్కరిణిలో భక్తుల పుణ్యతీర్థ స్నానాలు
- స్వామివారిని దర్శించుకున్న గవర్నర్ సీపీ రాధాకృష్ణన్

స్తంభోద్భవుడు.. ఏకశిఖరవాసుడు.. స్వయంభు పాంచనారసింహుడు వెలిసిన.. మహిమాన్విత యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి పుణ్యక్షేత్రంలో బుధవారం శ్రీచక్రత్ ఆళ్వార్ల అవబృత స్నానం, యాగశాలలో మహాపూర్ణాహుతి పర్వాలు శ్రీవైష్ణవ పాంచరాత్రాగమ శాస్త్రరీతిలో కొనసాగాయి. దీంతోపాటు దేవతోద్వాసన, శ్రీపుష్పయాగం, దోపు ఉత్సవాన్ని ఆలయ అర్చకులు వైభవంగా నిర్వహించారు. స్వామివారి బ్రహ్మోత్సవాలలో అత్యంత ప్రాధాన్యమున్న ఘట్టం చక్రతీర్థ స్నానం. ఉత్సవమూర్తులను, చక్రత్ ఆళ్వార్లను మంగళవాయిద్యాలు, వేదపారాయణలు, భక్తుల జయజయ ధ్వానాలు, కోలాట ప్రదర్శనల నడుమ కొండపైన విష్ణుపుష్కరిణి వద్దకు ఊరేగింపుగా తీసుకువచ్చి చక్రతీర్థస్నానం నిర్వహించారు. అంతకుముందు వసంతోత్సవం వైభవంగా సాగింది.

● యాదగిరిగుట్ట

•7లో..





గవర్నర్‌కు స్వామివారి ప్రసాదాన్ని అందజేస్తున్న సీఎస్ శాంతికుమారి

గుండెల నిండా ఆనందం

గవర్నర్ సీపీ రాధాకృష్ణన్

యాదగిరీశుడి దర్శనంతో గుండెల నిండా ఆనందం కలిగిందని గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ అన్నారు. బుధవారం ఆయన యాదగిరిక్షేత్రాన్ని సందర్శించి వార్షిక తిరుకల్యాణ బ్రహ్మోత్సవ కైంకర్యాల్లో పాల్గొన్నారు. ఆయన హైదరాబాద్ రాజ్‌భవన్ నుంచి కాన్వాయ్‌లో రోడ్డుమార్గంలో సాయంత్రం 7.10గంటలకు యాదగిరిక్షేత్రానికి విచ్చేశారు. కొండపైన ప్రధానాలయంలోని స్వయంభువులను దర్శించుకుని, స్వామివారి బ్రహ్మోత్సవాల్లో పాల్గొని సాయంత్రం సుమారు 8.45గంటలకు తిరిగి హైదరాబాద్‌కు తరలివెళ్లారు. యాదగిరిక్షేత్రంలో గవర్నర్ పర్యటన సుమారు గంట 35 నిమిషాలపాటు సాగింది. క్షేత్ర సందర్శనకు విచ్చేసిన ఆయనకు సీఎస్ శాంతికుమారి, ఆలయ అర్చకబృందం, దేవస్థాన, జిల్లా యంత్రాంగం ఘనంగా స్వాగతం పలికింది. కొండపైన పడమటి దిశలోని అతిథి గృహం వద్దకు చేరుకోగా జిల్లా పోలీసు అధికారులు ఆయనకు గౌరవ వందనం అందజేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎక్కడ చూసినా రాతి శిలల నిర్మాణాలే కనిపిస్తున్నాయని, ఇంతటి మహిమాన్విత ఆలయంలోనికి అడుగు పెట్టగానే ఏదో తెలియని ఆధ్యాత్మికానుభూతి కలిగిందన్నారు. అనంతరం ఆయన అక్కడ నుంచి ఉత్తర దిశలోని లిఫ్టు గుండా పడమటి దిశలోని అతిథి గృహానికి చేరుకుని కాన్వాయ్‌లో తిరిగి హైదరాబాద్‌కు బయల్దేరి వెళ్లారు. ఆయన వెంట దేవస్థాన, జిల్లా అధికారులు తదితరులున్నారు.

వ్యవసాయరంగానికి
పునరుజ్జీవం కోసం

- నేటి నుంచి రెండు రోజుల పాటు సదస్సు
- దక్షిణ తెలంగాణ ప్రాంతీయ పరిశోధన స్థానం ఆధ్వర్యంలో నిర్వహణ
- ఉమ్మడి జిల్లాలో ప్రధానంగా నాణ్యతలేని విత్తనాలు, మార్కెటింగ్ కొరత

వ్యవసాయరంగం సంక్షోభంలో కొట్టుమిట్టాడుతుండగా, దీన్ని నివారించేందుకు ప్రభుత్వం, శాస్త్రవేత్తలు, అధికారులు చర్యలు తీసుకోవాలనే అభిప్రాయాలు వెల్లువెత్తుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో ప్రధానంగా వరి, పండ్లతోటలు ఎక్కువగా సాగుచేస్తారు. ఈ పంటల సాగుతో పాటు, పంట ఉత్పత్తుల మార్కెటింగ్‌లో ఎదురవుతున్న ఇబ్బందులకు పరిష్కారాలు లభిస్తే తప్ప సాగు లాభదాయకం కాదని రైతులు అంటున్నారు. ఈ నేపథ్యంలో పంటలసాగు, వ్యవసాయ అనుబంధ రంగాల్లో ఎదురవుతున్న సమస్యలకు పరిష్కార మార్గాలు సూచించేందుకు ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం పూనుకుంది. అందులో భాగంగా నల్లగొండలో దక్షిణ తెలంగాణ మండల వ్యవసాయ పరిశోధన, విస్తరణ అధికారుల సలహా సంఘ సమావేశాన్ని నిర్వహించేందుకు నిర్ణయించింది. ఈ నెల 21, 22న రెండు రోజులపాటు ఈ సమావేశాలు నిర్వహించనుంది.

● ఆంధ్రజ్యోతిప్రతినిధి, నల్లగొండ



ఉమ్మడి జిల్లాలో 9.37లక్షల ఎకరాల్లో సాగయ్యే వరిలో అత్యధిక భాగం నాగార్జునసాగర్ ఆయకట్టు పరిధిలోనే ఉంది. వరిలో ప్రధానంగా ఉల్లికోడు, మొవ్వతెగులు వంటి చీడపీడలు, సుడిదోమ తాకిడితో దిగుబడులపై ప్రభావం చూపి రైతులు నష్టపోతున్నారు. ప్రైవేట్ విత్తనాలపైనే రైతులు ఎక్కువగా ఆధారపడడంతో, నాణ్యతలేని విత్తనాలతో దిగుబడులు తగ్గి అప్పులపాలవుతున్నారు. కూలీల కొరత నేపథ్యంలో యాంత్రీక వ్యవసాయానికి వరి సాగే అనుకూలమవడంతో రైతులు ఎక్కువగా వరి సాగు వైపే మొగ్గు చూపుతున్నారు. దీంతో వరి సాగు రైతులకు లాభసాటిగా ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సి ఉంది. ప్రధానంగా ధాన్యం మార్కెటింగ్‌కు రైతులు అవస్థలు పడుతున్నారు. పంట పండిన తర్వాత రైతులు విక్రయించుకునేందుకు నానా ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. విత్తనాలు, ఎరువులు, ఇతర ఖర్చులు గణనీయంగా పెరిగిన నేపథ్యంలో పెట్టుబడికి సమాంతరంగా ధర వచ్చే అవకాశాలు లేకపోవడంతో రైతులు అప్పులపాలవుతున్నారు. వరి తరువాత అత్యధికం ఎకరాల్లో సాగయ్యే పత్తిలోనూ రైతులు ప్రతికూలతలను ఎదుర్కొంటున్నారు. ప్రధానంగా నాసిరకం విత్తనాలు, బెట్ట, అధిక వర్షపాతాన్ని తట్టుకునే వంగడాలు లేకపోవడం, జిల్లాలోని మెట్టభూములకు అనుకూలమైన విత్తనాలు లేకపోవడం వంటి ప్రతికూలతలతో పత్తి రైతులు నష్టపోతున్నారు. వీటితో పాటు పత్తికి మద్దతు ధర కోసం సీసీఐ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నా, రైతులకు మాత్రం ఆశించిన ధర లభించక దళారీలను ఆశ్రయిస్తున్నారు. వేరుశనగ, కంది పంటల సాగుకు జిల్లా నేలలు అనుకూలమైనా, పందులు, కోతుల బెడదతో ఈ పంటల సాగుకు రైతులు ముందుకురావడం లేదు. అరకొరగా రైతులు ఈ పంటలు సాగుచేసినా, పంట చేతికొచ్చేంతవరకు నమ్మకం లేదు. వీటితోపాటు ఉమ్మడి జిల్లాలో అత్యధికంగా సుమారు 7లక్షల ఎకరాల్లో బత్తాయి తోటలు, మరో 1.50లక్షల ఎకరాల్లో నిమ్మతోటలు సాగవుతున్నాయి. ఈ పండ్ల తోటల సాగుకు రైతులు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. భూగర్భజలాలు తగ్గిన ప్రస్తుత పరిస్థితుల్లో పంటల దిగుబడిపై ఆ ప్రభవం కనిపిస్తోంది. నీటి వసతి లేకపోవడంతో పాటు మార్కెటింగ్ సదుపాయం కూడా రైతులకు జిల్లాలో అందుబాటులో లేకపోవడంతో వారు అనివార్యంగా దిగుబడులను దళారులకు విక్రయిస్తున్నారు. మార్కెటింగ్ సదుపాయంతో పాటు, నీటి వసతి కోసం డ్రిప్ ఇరిగేషన్, యంత్రాలను సబ్సిడీపై ప్రభుత్వం అందించి పంటల సాగుకు సహకరించాలని రైతులు కోరుతున్నారు. జిల్లాలో రైతులు మార్కెటింగ్ సమస్యను ప్రధానంగా ఎదుర్కొంటున్నారని, దీన్ని అధిగమించేందుకు ఫుడ్‌పార్క్ ఏర్పాటు చేస్తామని గత ప్రభుత్వం ప్రకటించినా, అది నెరవేరలేదు. జిల్లాలో వరి, బత్తాయి వంటి ప్రధానమైన పంటలకు సంబంధించి మార్కెటింగ్ సదుపాయం కల్పించాలని రైతులు కోరుతున్నారు.

ఇదిలా ఉండగా, రైతులు పంటలసాగులో, వ్యవసాయ అనుబంధ రంగాల్లో ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకొని వాటికి పరిష్కారం సూచించే ఉద్దేశంతో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నల్లగొండలో ఈ నెల 21, 22న రెండు రోజులపాటు సలహా మండలి సమావేశాలు నిర్వహించనున్నారు. ఈ సమావేశాల్లో ఉమ్మడి జిల్లా రైతులు వరి సాగు, ఇతర ఆరుతడి, ఉద్యాన పంటల సాగులో ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి, రైతులకు ఎలాంటి మద్దతు ఇవ్వాలనే అంశంపై ఈ సదస్సు సూచించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

నేడు, రేపు సమావేశాలు

నల్లగొండ: ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయశాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 21, 22న జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో దక్షిణ తెలంగాణ మండల వ్యవసాయ పరిశోధన, విస్తరణ అధికారుల సలహా సంఘ సమావేశాన్ని నిర్వహించనున్నట్టు కంపసాగర్ శాస్త్రవేత్త జి.శివప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుత వ్యవసాయరంగంలో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తెలుసుకుని వాటిని తీర్చే దిశగా పరిశోధనలు చేపట్టడం, సమస్యలకు సరైన పరిష్కారం అందించడంపై సమావేశంలో చర్చించనున్నట్లు తెలిపారు. గత ఏడాది రైతులు లేవనెత్తిన అంశాలకు సాంకేతిక పరమైన పరిష్కారాలు తెలియజేయడంతో పాటు గత ఏడాది వ్యవసాయ విశ్వవిద్యాలయం సాధించిన ప్రగతిని వివరిస్తామన్నారు. ఈ సమావేశంలో వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు, దక్షిణ తెలంగాణ మండల వ్యవసాయ అధికారులు, అనుబంధశాఖల అధికారులు, 11 జిల్లాల రైతులు పాల్గొంటారని తెలిపారు. రైతులు ఈ సదస్సులో అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

మంత్రి వార్నింగ్..
దిగొచ్చిన మిల్లర్లు

చర్యలు తీసుకోవాలని జేసీ, డీఎస్‌వోలకు ఫోన్‌లో ఆదేశం

మిర్యాలగూడ అర్బన్, మార్చి 20: సన్నబియ్యం ధరలకు అనుగుణంగా క్వింటా ధాన్యానికి రూ. 2800 నుంచి రూ. 3వేలు తగ్గకుండా కొనుగోళ్లు చేపట్టాలని మిల్లర్లను మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆదేశించారు. కొర్రీలు పెట్టి రైతులకు నష్టం జరిగేలా వ్యవహరిస్తే మిల్లులను సీజ్ చేయిస్తామని వార్నింగ్ ఇచ్చారు. నియోజకవర్గంలోని గూడూరు, వెంకటాద్రిపాలెం గ్రామాల్లో నిర్మించిన దేవాలయాల్లో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి బుధవారం బయలుదేరారు. మార్గమధ్యలో వేములపల్లి మండలం శెట్టిపాలెం గ్రామంలో నార్కట్‌పల్లి - అద్దంకి ప్రధాన రహదారిపై ఉన్న మిల్లు పాయింట్ల వద్ద ధాన్యం అమ్ముకునేందుకు నిరీక్షిస్తున్న రైతులను చూసి ఆయన ఆగారు. రైతుల వద్దకు చేరుకొని ధాన్యం కొనుగోలు తీరుపై ఆరా తీయగా పలువురు రైతులు తమకు జరుగుతున్న నష్టాన్ని మంత్రికి ఏకరువు పెట్టారు. దీంతో స్పందించిన ఆయన జాయింట్ కలెక్టర్, జిల్లా సివిల్ సప్లయ్ అధికారులకు ఫోన్‌చేసి మాట్లాడారు. మిల్లర్లు సిండికేట్‌గా మారి రైతులకు గిట్టుధర చెల్లించకుండా చేస్తున్న తీరును అధికారులకు వివరించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కొర్రీలు పెట్టి రైతులకు నష్టం జరిగేలా వ్యవహరిస్తే మిల్లులను సీజ్ చేయిస్తామని వార్నింగ్ ఇచ్చారు. శెట్టిపాలెం వద్ద మహర్షి రైస్‌మిల్లులో కొనుగోళ్లు నిపివేయడంపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. ధాన్యం కొనుగోలు వ్యవహారంలో మిల్లర్లు తెలివి ప్రదర్శిస్తున్నారు. అవసరమైతే ప్రభుత్వమే సన్నధాన్యం కొనుగోలు చేస్తుంది. మిల్లర్లు అప్పుడెలా దిగిరారో చూస్తాం మని అన్నారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రితో చర్చించి వ్యాపారుల తీరుపై చర్యలు తీసుకుంటామని మంత్రి రైతులకు హామీ ఇచ్చారు. తక్కువ ధరకు దిగుమతి చేసుకున్న కొనుగోలు పట్టీలను పరిశీలించి గిట్టుబాటు ధర ఇప్పించాలని అధికారులను ఆదేశించారు. మిల్లు పాయింట్ల వద్ద సాఫీగా ధాన్యం కొనుగోళ్లు జరిగేలా అధికారులు నిరంతర పర్యవేక్షించాలని సూచించారు. ధాన్యం కొనుగోలు చేయని మిల్లులను గుర్తించి చర్యలు తీసుకోవాలని, అవసరమైతే సీజ్ చేయాలంటూ జేసీ, డీఎస్‌వోలను మంత్రి ఆదేశించారు. దీంతో డీఎస్‌వో వెంకటేశ్వర్లు మిర్యాలగూడకు చేరుకొని కొనుగోలు ప్రక్రియను పరిశీలించిన అనంతరం మిల్లర్లతో సమీక్ష నిర్వహించారు.



మిల్లర్ల తీరును అధికారులకు ఫోన్‌లో వివరించి చర్యలు తీసుకోవాలని ఆదేశిస్తున్న మంత్రి వెంకట్‌రెడ్డి

కొనుగోళ్లను వేగవంతం చేసిన మిల్లర్లు

మిల్లు పాయింట్ల వద్దకు సన్నధాన్యం వెల్లువలా తరలి వస్తుండటాన్ని గమనిస్తున్న వ్యాపారులు తమలో పోటీతత్వాన్ని నియంత్రించేందుకు సిండికేట్‌గా మారారు. వంతుల వారీగా ధాన్యం కొనుగోళ్లు చేపట్టేలా అవగాహనకు రావడంతో ధరలో మార్పు జరగడం లేదు. ఇదే విషయాన్ని రైతుల ద్వారా తెలుసుకున్న మంత్రి వెంకట్‌రెడ్డి మిల్లర్ల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసి చర్యల నిమిత్తం ఉన్నతాధికారులను ఆదేశించడంతో మిల్లర్లు దిగొచ్చారు. బుధవారం వేములపల్లి, మిర్యాలగూడ, యాద్గార్‌పల్లి ప్రాంతాల్లో 84 పార్‌బాయిల్డ్ రైస్‌మిల్లులు విస్తరించి ఉండగా, కేవలం 20 మిల్లుల్లో మాత్రమే ధాన్యం కొనుగోళ్లు జరిగాయి. దీంతో ఒక్కో మిల్లు పాయింటు వద్ద పదుల సంఖ్యలో ధాన్యం ట్రాక్టర్లు క్యూకట్టి నిలిచాయి. మంత్రి ఆదేశాలతో అధికారులు కదిలిరావడాన్ని గమనించిన మిల్లర్లు కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేశారు. దీంతో 54మిల్లు పాయింట్ల వద్ద ధాన్యం కొనుగోలు మొదలుపెట్టడంతో రైతులకు కాసింత ఉపశమనం కలిగింది. అయితే ధరలో మాత్రం ఎలాంటి మార్పు జరగలేదు. క్వింటాల్ ధాన్యానికి రూ. 2300నుంచి 2450 మాత్రమే చెల్లించడం గమనార్హం.

సీపీఎం ఒంటరి పోరు

భువనగిరి అభ్యర్థిగా జహంగీర్

యాదాద్రి, మార్చి20 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికలకు సీపీఎం ఒంటరి పోరుకు సిద్ధమైంది. సీపీఎం భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థిగా ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎండీ.జహంగీర్‌ను రాష్ట్ర కమిటీ బుధవారం ప్రకటించింది. మొత్తం 17 లోక్‌సభ స్థానాల నుంచి పోటీలో ఉండటనున్నట్లు ప్రకటించిన పార్టీ, తొలి అభ్యర్థిగా జహంగీర్‌ను ప్రకటించింది. ఈస్థానం నుంచి పోటీలో ఉంటున్నట్లు ఇటీవల ఆ పార్టీ నేతలు కూడా వ్యాఖ్యానించారు. జహంగీర్ స్వగ్రామం రామన్నపేట మండలం మునిపంపుల. విద్యార్థి దశలోనే ఎస్ఎఫ్ఐలో చేరి, ప్రజా సంఘాల్లో పనిచేస్తూ పూర్తికాలం కార్యకర్తగా పనిచేస్తున్నారు. వామపక్ష భావజాలంతో ఎన్నో ఉద్యమాల్లో పాల్గొన్నారు. 2009లో సీపీఎం నుంచి మాజీ ఎమ్మెల్యే నోముల నర్సింహయ్య, 2014 ఎన్నికల్లో సీపీఎం జాతీయ కార్యవర్గసభ్యుడు చెరుపల్లి సీతారాములు ఇక్కడి నుంచి పోటీ చేశారు. 2019లో సీపీఐ అభ్యర్థి గోదా శ్రీరాములు పోటీ చేశారు. భువనగిరి నియోజకవర్గం ఏర్పడకముందు పూర్వపు నల్లగొండ నియోజకవర్గంగా ఉండేది. ఆ సమయంలో ఈ నియోజకవర్గం నుంచి టీడీపీ-వామపక్ష, మిత్ర పక్షాల అభ్యర్థులుగా సీపీఐ నుంచి బొమ్మగాని ధర్మభిక్షం, సురవరం సుధాకర్ రెడ్డిలు ఎంపీగా పోటీచేసి గెలుపొందారు. సీపీఐ నుంచి పోటీ చేసేందుకు రాష్ట్రంలో ఏదైనా ఒక నియోజకవర్గాన్ని కేటాయించాలని పార్టీ అధిష్ఠానం కాంగ్రెస్ పార్టీకి విజ్ఞప్తిచేసింది. ఇటీవల జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్, సీపీఐ ఉమ్మడిగా కలిసి పోటీ చేశాయి. ఈ నేపథ్యంలో తమకు ఒక సీటు కేటాయించాలని కోరాయి. కాంగ్రెస్ అధిష్ఠానం నుంచి ఇప్పటివరకు ఎలాంటి నిర్ణయం వెలువడలేదు. ఈ నేపథ్యంలో సీపీఐ ఎన్నికల బరిలో ఉంటుందా? లేదా అనేది చూడాల్సిందే.

నిబంధనలు పకడ్బందీగా అమలుచేయాలి

కలెక్టర్ దాసరి హరిచందన

దేవరకొండ, హాలియా, మార్చి 20: ఎన్నికల కమిషన్ సూచించిన నియమ, నిబంధనలను పకడ్బందీగా అమలు చేయాలని కలెక్టర్ దాసరి హరిచందన అన్నారు. దేవరకొండ ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో బుధవారం పార్లమెంట్ ఎన్నికల డిస్ట్రిబ్యూటరీ కేంద్రాలను పరిశీలించారు. దేవరకొండ ఎస్టీ గురుకుల బాలికల డిగ్రీ కళాశాలను సందర్శించారు. విద్యార్థులకు అందించే మెనూను తెలుసుకొని మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు కోసం నమోదు చేసుకోవాలని కలెక్టర్ హరిచందన అన్నారు. హాలియా మునిసిపాలిటీలోని డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాన్ని ఆమె పరిశీలించి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ఓటర్ లిస్ట్‌లో పేరుతో పాటు పోలింగ్ కేంద్రం కూడా ఎక్కడ ఉందో తెలుసుకోవాలన్నారు. డీఆర్‌సీ సెంటర్లలో ఉన్న మౌలిక సదుపాయాలను, సీసీ కెమెరాల పనితీరు, ఎలక్ట్రిసిటీ, స్ట్రాంగ్ రూం భద్రతను పరిశీలించారు. అనంతరం నాగార్జునసాగర్ - నల్లగొండ మార్గమధ్యంలో పులిమామిడి స్టేజీ వద్ద ఎస్ఎస్‌టీ, పోలీస్ చెక్‌పోస్టును పరిశీలించి తగు సూచనలు చేశారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ శ్రీనివాస్, ఆర్డీవోలు శ్రీరాములు, శ్రీనివాస్‌రావు, డీఎస్పీ గిరిబాబు, రెవెన్యూ, పోలీసు, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.



దేవరకొండ ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని పరిశీలించి మాట్లాడుతున్న కలెక్టర్

రాజకీయ ప్రకటనల పరిశీలనకు ఎంసీఎంసీ కమిటీ

నల్లగొండటౌన్: పార్లమెంట్ ఎన్నికలలో భాగంగా ప్రచురితమయ్యే రాజకీయ ప్రకటనల పరిశీలన, పెయిడ్ న్యూస్ పరిశీలన కోసం మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కమిటీ (ఎంసీఎంసీ)ని ఏర్పాటు చేసినట్లు జిల్లా రెవెన్యూ అధికారి డి. రాజ్యలక్ష్మి తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా బుధవారం కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎంసీఎంసీ సెంటర్‌ను ఆమె ప్రారంభించి మాట్లాడారు. మీడియా ఛానళ్లలో ప్రసారమయ్యే రాజకీయ ప్రకటనలకు తప్పనిసరిగా ఎంసీఎంసీ ద్వారా ముందస్తు అనుమతి తీసుకోవాలన్నారు. అదే విధంగా ప్రింట్ మీడియాలో ప్రచురితమైన ప్రకటనలను, పెయిడ్ న్యూస్ పరిశీలించేందుకు ఎంసీఎంసీ పనిచేస్తుందని అన్నారు. కార్యక్రమంలో ఎంసీఎంసీ కమిటీ సెక్రటరీ, డీపీఆర్వో వెంకటేశ్వర్లు, మీడియా రిలేషన్స్ నోడల్ అధికారి, జిల్లా పరిశ్రమల శాఖ మేనేజర్ కోటేశ్వరరావు, ఎంసీఎంసీ సభ్యులు, జిల్లా ఇన్ఫర్మేటిక్ అధికారి గణపతిరావు, గృహ నిర్మాణ శాఖ పీడీ రాజకుమార్, ఎంసీఎంసీ సిబ్బంది, మీడియా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

కోతలరాయుడు కోమటిరెడ్డి

- 100 రోజుల పాలనలో బెదిరింపులు, దందాలపైనే మంత్రుల దృష్టి
- ఢిల్లీకి ముడుపులు మోయడమే సీఎం పని
- మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి

మిర్యాలగూడ, మార్చి 20: మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డివి కోతలే తప్ప చేతలేమీ ఉండవని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి విమర్శించారు. బుధవారం మిర్యాలగూడ మండలం యాద్గార్‌పల్లి గ్రామంలో ఎండిన వరి పొలాలను ఎమ్మెల్సీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు భాస్కర్‌రావు, భూపాల్‌రెడ్డి, విజయసింహారెడ్డిలతో కలిసి పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ గుళ్లు, గోపురాలు తిరుగుతున్న జిల్లా మంత్రికి పక్కనే ఎండుతున్న పంట పొలాలను పరిశీలించాలన్న సోయి లేకుండా పోయిందన్నారు. రైతుల కష్టాలకు బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన పాపాలే కారణమని మంత్రి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. మంత్రి బుద్ధి ఉండి మాట్లాడుతున్నాడా.. తాగి మాట్లాడుతున్నాడా అంటూ ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ వచ్చిన తరువాత నాటుపెట్టిన పొలాలు ఎండిపోవడం ఈ ప్రభుత్వ పాపమేనన్నారు. కళ్ల ముందే మేజర్ల వద్ద పోలీసులను కాపలా పెట్టి పాలేరుకు నీటిని తరలిస్తున్నా మంత్రి సోయిలేకుండా పడుకున్నాడని విమర్శించారు. రైతులకిచ్చే రూ.500 బోనస్‌ను తప్పించుకునేందుకు రైతుల పంటలను ఎండబెడుతున్న దుర్మార్గపు ప్రభుత్వం ఇదేనన్నారు. బోర్లు, బావులు ఒట్టిపోయి లక్షల ఎకరాల్లో పంటలు ఎండి రైతులు నష్టపోతున్నా, జిల్లా మంత్రులు క్షేత్రస్థాయి పర్యటన మరిచారన్నారు. రైతుల సమస్యలు వారికి పట్టవని విమర్శించారు. ఆయకట్టు చివరివరకు నీరందించి పంటలు కాపాడిన ఘనత బీఆర్ఎస్‌దేనని అన్నారు. 100 రోజుల పాలనలో బెదిరింపులు, దందాలు వసూళ్లపైనే జిల్లా మంత్రులు దృష్టి సారించారని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి తరుచూ ఢిల్లీకి వెళ్లి ముడుపులు కట్టడంపై ఉన్న శ్రద్ధ ప్రజాసంక్షేమంపై లేదన్నారు. జిల్లాల వారీగా సమీక్షా సమావేశాలు నిర్వహించి నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మాజీ మంత్రి వెంట జిల్లా రైతుబంధు సమితి మాజీ అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాసరెడ్డి, జడ్పీ కోఆప్షన్ సభ్యుడు మోసీన్‌అలీ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సైదులుయాదవ్, నామిరెడ్డి కరుణాకర్‌రెడ్డి, కంచర్ల కృష్ణారెడ్డి, అమరావతి సైదులు, చౌగాని భిక్షం, కట్టా మల్లేష్, హాతీరాంనాయక్, వీరకోటిరెడ్డి, సోయబ్, తదితరులు పాల్గొన్నారు.



యాద్గార్‌పల్లిలో ఎండిన పంటను పరిశీలించి, రైతులతో మాట్లాడుతున్న మాజీమంత్రి జగదీష్‌రెడ్డి

ఉమ్మడి జిల్లాలో రూ.9.09లక్షలు స్వాధీనం


రామాపురం చెక్‌పోస్టు వద్ద నగదు స్వాధీన పత్రాన్ని అప్పగిస్తున్న పోలీసులు

నార్కట్‌పల్లి, కోదాడ రూరల్, పెన్‌పహాడ్, మార్చి 20: ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో అనుమతికి మించి తరలిస్తున్న రూ.9.09లక్షల నగదును పోలీసులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లిలో పలువురి నుంచి రూ.5.12లక్షల నగదు, బెల్టు షాపుల నుంచి రూ.2,925 విలువైన మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ అంతిరెడ్డి తెలిపారు. నార్కట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చేపట్టిన వాహన తనిఖీల్లో ఈ నగదు, మద్యం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సూర్యాపేట జిల్లా కోదాడ మండలంలోని నల్లబండగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని ఆంధ్రా సరిహద్దు రామాపురం క్రాస్‌రోడ్డు అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద నాలుగు వాహనాల నుంచి రూ. 3.03 లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ అనిల్‌రెడ్డి తెలిపారు. సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండలంలోని దూపహాడ్‌లో బైక్‌పై వెళ్తున్న వ్యక్తి నుంచి రూ.94 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ రవీందర్ తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి


నర్సింహ(ఫైల్)

గుర్రంపోడు, మార్చి 20: విద్యుదాఘాతంతో వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా గుర్రంపోడు మండలంలోని ఆమలూరు గ్రామంలో బుధవారం జరిగింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన వంగూరి నర్సింహ(52) తన ఇంటికి నిర్మించిన ప్రహరీకి ఫ్లోరింగ్ చేస్తుండగా మోటారుకు అమర్చిన విద్యుత్తు వైర్ తేలడంతో దానికి తగిలి విద్యుదాఘాతానికి గురయ్యాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. నర్సింహకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు నాగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

హిజ్రాల బైండోవర్


హిజ్రాలను బైండోవర్ చేస్తున్న పోలీసులు

తుంగతుర్తి, మార్చి 20: సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలకేంద్రంలో సోమవారం వీరంగం సృష్టించిన హిజ్రాలను పోలీసులు బుధవారం బైండోవర్ చేశారు. హిజ్రాల గుంపులు ఒకరిపై ఒకరు దాడులు చేసుకోవడంతో ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. ఈ ఘటనపై పోలీసులు సుమోటోగా కేసు నమోదు చేసి 18 మంది హిజ్రాలను బుధవారం స్థానిక తహసీల్దార్ రమణారెడ్డి ఎదుట బైండోవర్ చేశారు. మరోసారి ఇలాంటి సంఘటనలు పునరావృతమైతే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐ శ్రీనివాస్, శ్రీను, ఎస్ఐ ఏడుకొండలు పాల్గొన్నారు.

మర్రిపడగలో చోరీ

గుండాల, మార్చి 20: యాదాద్రిభువనగిరి జిల్లా గుండాల మండలంలోని మర్రిపడగ గ్రామంలోని ఓ ఇంట్లో మంగళవారం చోరీ జరిగింది. గ్రామానికి చెందిన ఆటిపాముల రాములు తాళం వేసి జనగామకు వెళ్లాడు. మంగళవారం రాత్రి ఇంట్లోకి జొరబడిన దొంగలు ఇంటి తాళం పగులగొట్టి ఇంట్లో ఉన్న బీరువాలో ఉన్న రూ.లక్షా 20వేల నగదు ఎత్తుకెళ్లారు. అదే విధంగా కొండబోయిన సత్తయ్య ఇంటి తాళం పగులగొట్టి బీరువాలో ఉన్న రూ.10వేల నగదు అపహరించారు. బాధితులు పనులు ముగించుకొని తిరిగి ఇళ్లకు వచ్చేసరికి తాళం పగులగొట్టి ఉండడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ యాకన్న తెలిపారు.

వైభవంగా చక్రతీర్థ స్నానం

● గుట్టలో శాస్త్రోక్తంగా మహాపూర్ణాహుతి ● కొండపైన విష్ణుపుష్కరిణిలో భక్తుల పుణ్యతీర్థ స్నానాలు


విష్ణుపుష్కరిణి చెంతకు ఊరేగింపుగా వెళుతున్న భక్తులు


దేవతోద్వాసన, భేరీ పూజా వైదిక పర్వాలు నిర్వహిస్తున్న అర్చకులు


విష్ణుపుష్కరిణిలో పుణ్యస్నానాలు చేస్తున్న భక్తులు

యాదగిరిగుట్ట, మార్చి20: స్తంభోద్భవుడు.. ఏకశిఖరవాసుడు.. స్వయంభూ పాంచనారసింహుడు వెలిసిన.. మహిమాన్విత యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి పుణ్యక్షేత్రంలో బుధవారం శ్రీచక్రత్ ఆళ్వార్ల అవబృత స్నానం, యాగశాలలో మహాపూర్ణాహుతి పర్వాలు శ్రీవైష్ణవ పాంచరాత్రాగమ శాస్త్రరీతిలో వైభవంగా జరిగాయి. అత్యంత ప్రాధాన్యత గల ఘట్టం చక్రతీర్థ స్నాన వేడుక. లక్ష్మీనృసింహుల ఉత్సవమూర్తులను, చక్రత్ ఆళ్వార్లను ప్రత్యేక సేవలో తీర్చిదిద్దిన ఆచార్యులు మంగళవా యిద్యాలు, వేదపారాయణాలు, భక్తుల జయజయ ధ్వానాలు, కోలాట ప్రదర్శనల నడుమ కొండపైన విష్ణుపుష్కరిణి వద్దకు ఊరేగింపుగా తరలి వచ్చారు. వసంతోత్సవం శోభాయమానంగా సాగింది. ప్రభాతవేళ శ్రీవైష్ణవ సేవా సమాఖ్య ఆధ్వర్యంలో ప్రభాతభేరి కార్యక్రమం కొనసాగింది. ఆధ్యాత్మిక ఘట్టాలను దేవస్థాన ప్రధానార్చకులు నల్లన్‌థిఘళ్ లక్ష్మీనరసింహాచార్యులు, కాండూరి వెంకటాచార్యులు, అర్చకబృందం, రుత్వికులు ఆగమశాస్త్రరీతిలో నిర్వహించారు. ఆలయ అనువంశిక ధర్మకర్త బి. నరసింహమూర్తి, ఈవో భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మహాపూర్ణాహుతి

స్వామివారి బ్రహ్మోత్సవాల్లో స్వస్తి పుణ్యాహవాచనంతో ఆరంభించి మహాపూర్ణాహుతి వరకు నిర్వహించే ప్రతీ వేడుక మంగళ ప్రదములే.. విశ్వశాంతి.. లోకల్యాణంలో కోసం నిర్వహించే వార్షిక బ్రహ్మోత్సవాలు ఏక కుండాత్మకంగా నవాహ్నికంగా నిర్వహించడం ఆలయ సంప్రదాయం. మహోత్సవాలకు విచ్చేసే అశేష భక్తకోటిని అనుగ్రహింపజేయని కోరుతూ ముప్పై మూడు కోట్ల దేవతలను యాగశాలలో నిత్య హవన పూజలలో ఆయా దేవతలను వారివారి మూల మంత్రాలతో హవిస్సులను అందజేస్తారు. సువృష్టితో లోకాలను క్షేమం కలిగించాలని వేడుకొంటూ మహోత్సవాల పరిసమాప్తిగా మహాపూర్ణాహుతి కార్యక్రమం నిర్వహిస్తారు.

దోపోత్సవం

పరమ భక్తాగ్రేసరుడు, ఆళ్వారాచార్యుడు తిరుమంగైయాళ్వార్ జీవిత చరిత్రను శ్రీవైష్ణవ దేవాలయాల్లో బ్రహ్మోత్సవాల్లో ఉత్సవాంతంగా హరికథా కాలక్షపంలో తెలిపే వేడుకే దోపోత్సవం. భక్తరక్షణా తత్పరుడు శ్రీమన్నారాయణుడుని త్రికరణ శుద్ధిగా కొలిస్తే ముక్తిని ప్రసాదిస్తాడని తిరుమంగైయాళ్వార్ చరిత్ర తెలుపుతోంది. తన ప్రేయసి కుముదవల్లి కోరిక మేరకు ప్రతి నిత్యం 1116 మంది బ్రాహ్మణోత్తములకు అన్న సంతర్పణ చేసేందుకు దారి దోపిడీ దొంగగా మారాడు. అయినా భగవానుడిపై ఆయనకు ఉన్న అచంచలమైన భక్తి విశ్వాసాలతో నిస్వార్థ పూరితంగా జరిపిన అన్న సంతర్పణకు శ్రీమన్నారాయణుడు కరుణించి మొక్షాన్ని ప్రసాదిస్తాడు. నిస్వార్థ భక్తితో స్వామిని సేవిస్తే ఆయన కరుణించి ముక్తిని ప్రసాదిస్తాడని, యావత్ భక్త జనకోటి యజ్ఞయాగాది క్రతువులు ఆచరిస్తూ.. అశేషంగా అన్న సంతర్పణ జరపి భగవానుడి కృపా కటాక్షాలు పొందాలని దోపోత్సవం నిర్వహించడం ఆనవాయితీ.

ముగిసిన సంస్కృతిక కార్యక్రమాలు

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా కొండపైన ఈ నెల 15న ఆరంభమైన ధార్మిక, సాహిత్య, సంగీత మహాసభలు బుధవారం ముగిసాయి. ఉదయం వీరప్రతాప భజన మండలి, పాండురంగ భజన మండలి, గాయిత్రి భజన మండలిలచే భక్తి భజనలు, బ్రహ్మశ్రీ బాస్కరభట్ల ఆంజనేయశర్మచే ఆధ్యాత్మిక ప్రవచనం, లక్ష్మీనారాయణ భాగవతార్‌చే హరికథా కాలక్షేపం, సాయంత్రం ఎస్ నాగజ్యోతి, శ్రీమతి కొటూరి గాయిత్రిలచే భక్తి సంగీతం, శ్రీమతి తోరణాల పద్మచే కర్ణాటక సంగీతం, కుమారి మాహ్నిత కూచిపూడి నృత్యం, శ్రీమతి శోభరాజుచే సంగీత కచేరి, శ్రీమతి జ్వాలాముఖి కూచిపూడి నృత్యం, రిషి డాన్స్ అకాడమిచే పేరిణి నృత్యం, అనంతరం ఆస్థాన విద్వాంసుల మంగళవాయిద్య కచేరి సంగీత మహా సభల పరిసమాప్తి. యాదగిరీశుడి సన్నిధిలో బుధవారం నిత్యవిధి కైంకర్యాలు ఆగమ శాస్త్రరీతిలో వైభవంగా జరిగాయి. నిర్వహించారు. కొండపైన అనుబంధ శివాలయంలో రామలింగేశ్వరసామికి నిత్యవిధి కైంకర్యాలు, నిత్య రుద్రహవన పూజలు స్మార్త సంప్రదాయరీతిలో కొనసాగాయి. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.22,98,275 ఆదాయం సమకూరినట్టు దేవస్థాన అధికారులు తెలిపారు.

విష్ణుపుష్కరిణిలో పుణ్యస్నానాలకు అనుమతి

విష్ణుపుష్కరిణిలో చక్రతీర్థ పుణ్యస్నానాలకు భక్తులకు దేవస్థాన అధికారులు బుధవారం అనుమతి ఇచ్చారు. బ్రహ్మోత్సవాల్లో విశేష ఘట్టమైన చక్రతీర్థ స్నానం సంప్రదాయరీతిలో కొండపైన సహజ సిద్ధ విష్ణుపుష్కరిణిలో నిర్వహించడం ఆనవాయితీ. అయితే ఆలయ ఉద్ఘాటన జరిగిన అనంతరం తొలిసారి బ్రహ్మోత్సవాల్లో మాత్రం దేవస్థాన అధికారులు కొండపైన విష్ణుపుష్కరిణిలో సామాన్య భక్తులను అనుమతించలేదు. ఆలయ పునర్నిర్మాణానికి ముందు, పునర్నిర్మాణ సమయంలోనూ బ్రహ్మోత్సవాల్లో విష్ణుపుష్కరిణిలో సామాన్య భక్తులను చక్రతీర్థ పుణ్యస్నానాలకు అనుమతించారు. ఆలయ జీర్ణోద్ధరణ సమయంలో తాత్కాలిక బాలాలయంలో వేడుకలు నిర్వహించారు. 2022లో నిర్వహించిన వార్షిక బ్రహ్మోత్సవాల్లో భక్తులను పుష్కరిణిలోనికి అనుమతించలేదు. బాలాలయంలోని గంగాళంలోని పవిత్ర జలాలతో అర్చకబృందం సంప్రోక్షణ జరిపారు.

గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ పర్యటన సాగిందిలా..

రాష్ట్ర నూతన గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ యాదగిరిక్షేత్రాన్ని సందర్శించి వార్షిక తిరుకల్యాణ బ్రహ్మోత్సవ కైంకర్యాల్లో పాల్గొన్నారు. ఆయన హైదరాబాద్ రాజ్‌భవన్ నుంచి కాన్వాయ్‌లో రోడ్డుమార్గంలో సాయంత్రం 7.10గంటలకు యాదగిరిక్షేత్రానికి విచ్చేశారు. కొండపైన ప్రధానాలయంలోని స్వయంభువులను దర్శించుకుని, స్వామివారి బ్రహ్మోత్సవాల్లో పాల్గొని సాయంత్రం సుమారు 8.45గంటలకు తిరిగి హైదరాబాద్‌కు తరలివెళ్లారు. అనంతరం ఆయన లిఫ్టు గుండా ఆలయ తిరువీధుల్లోకి చేరుకుని తూర్పు పంచతల రాజగోపురం నుంచి ప్రధానాలయంలోకి వచ్చారు. ప్రధానాలయ తూర్పు రాజగోపురం వద్ద దేవస్థాన అర్చకస్వాములు, వేద పండితులు ఆలయ సంప్రదాయం ప్రకారం పరివెట్టం కట్టి పూర్ణకుంభంతో వేదమంత్రాలు, మంగళవాయిద్యాలతో స్వాగతం తెలిపారు. ఆయన తూర్పు ఈశాన్య త్రితల రాజగోపురం నుంచి ప్రధానాలయంలోనికి ప్రవేశించి ఆంజనేయస్వామికి, గండభేరుండ లక్ష్మీనృసింహుడిని దర్శించుకున్నారు. ముఖమండపంలో స్వర్ణతాపడ ధ్వజస్తంభం, బలిపీఠంలకు మొక్కి గర్భాయంలోనికి వెళ్లారు. గర్భాలయంలో అర్చకస్వాములు గోత్రనామాలతో సువర్ణ పుష్పార్చన పూజలు జరిపి హారతి, శఠగోపం అందజేశారు. ముఖమండపంలో ఆలయ ప్రధానార్చకులు నల్లన్‌థిఘళ్ లక్ష్మీనరసింహాచార్యులు ఆధ్వర్యంలో అర్చకబృందం, వేదపండితులు చతుర్వేదాలతో ఆశీర్వచనం జరిపారు. ఆలయ సంప్రదాయం ప్రకారం అనువంశిక ధర్మకర్త భాస్కరాయణి నరసింహమూర్తి ఆయనకు స్వామివారి శేషవస్త్రాలను, అభిషేకం లడ్డూ ప్రసాదాలను అందజేశారు. సీఎస్ శాంతి కుమారి ఆయనకు స్వామివారి చిత్రపటాన్ని, ప్రసాదాలను అందజేశారు.

యాదగిరీశుడి సేవలో తెలంగాణ సీఎస్ శాంతికుమారి

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామిని బుధవారం సీఎస్ శాంతికుమారి దర్శించుకున్నారు. క్షేత్ర సందర్శనకు విచ్చేసిన ఆమెకు కొండపైన పడమటి దిశలోని లిఫ్టు వద్ద యాదాద్రి భువనగిరి కలెక్టర్ హనుమంతు కే.జెండగే, డీసీపీ రాజేశ్‌చంద్రలు మొక్కలను అందజేసి ఘనంగా స్వాగతం పలికారు. ఆమె లిఫ్టు గుండా నేరుగా ఉత్తర తిరుమాడవీధి గుండా శివాలయంలోనికి వెళ్లారు. శివాలయంలో పర్వతవర్ధినీ సమేత రామలింగేశ్వరస్వామి వద్ద ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. శివాలయ అర్చకులు పూజలనంతరం ఆమెను ఆశీర్వదించారు.

షేర్‌మార్కెట్‌లో నష్టపోయి సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య

మిర్యాలగూడ అర్బన్, మార్చి 20: షేర్ మార్కెట్‌లో నష్టపోయి ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్నాడు. బుధవారం రాత్రి నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని శాంతినగర్‌లో ఈ సంఘటన జరిగింది. స్థానికులు, టూటౌన్ ఎస్ఐ కృష్ణయ్య తెలిపిన వివరాల ప్రకారం... మిర్యాలగూడ పట్టణానికి చెందిన గోలి శ్రీనివాసరావు (43) ఓ ప్రైవేట్ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా (వర్క్ ఫ్రమ్ హోం) పని చేస్తున్నాడు. ఇద్దరు పిల్లలు కలిగిన తర్వాత రెండేళ్ల క్రితం భార్యాభర్తల మధ్య విభేదాలు తలెత్తగా ఆమె భర్తకు దూరంగా ఉంటోంది. భార్యాభర్తల మధ్య ఏర్పడిన గొడవలపై పోలీస్‌స్టేషన్‌లో కేసులు సైతం పెట్టుకొని కోర్టు విచారణ ఎదుర్కొంటున్నారు. శ్రీనివాసరావు షేర్ మార్కెట్ వ్యాపారంలో ఆర్థికంగా దెబ్బతిని అప్పుల ఊబిలో చిక్కుకున్నాడు. భార్య పిల్లలు దూరం కావడం, ఆర్థిక ఇబ్బందులు వెంటాడటంతో మానసికంగా కుంగిపోయిన శ్రీనివాసరావు తల్లిదండ్రులు ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని బలవన్మరణం చెందాడు. స్థానికుల ద్వారా సమాచారం తెలుసుకున్న టూటౌన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ఆత్మహత్యకు గల కారణాలు తెలుసుకున్నారు. శ్రీనివాసరావు గదిలో పోలీసులకు సూసైడ్ నోట్ లభ్యమైంది. షేర్ మార్కెట్ నష్టం, భార్యా పిల్లలు దూరమవడంతో మానసికంగా నలిగిపోతూ ఆత్మహత్య చేసుకుంటున్నట్లు సూసైడ్ నోట్‌లో రాసినట్లు ఎస్ఐ కృష్ణయ్య తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడు శ్రీనివాసరావు తండ్రి హన్మంతరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కృష్ణయ్య తెలిపారు.

ఎంఐఎం జిల్లా అధ్యక్షుడిపై కేసు నమోదు

నల్లగొండ టౌన్, మార్చి 20: రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కాన్వాయ్‌ను అడ్డుకోవడంతో పాటు బందోబస్తులో ఉన్న పోలీసుల విధులకు ఆటంకం కలిగించినందుకు ఎంఐఎం జిల్లా అధ్యక్షుడు రజీయుద్దీన్‌తో పాటు అతని అనుచరులపై స్థానిక వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నెల 16వ తేదీన రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కలెక్టరేట్ జరిగిన సమావేశంలో పాల్గొని తిరిగి వెళ్తుండగా ఎంఐఎం జిల్లా అధ్యక్షుడు రజీయుద్దీన్‌తో పాటు మరికొందరు సీఏఏ పట్ల తమ వైఖరిని స్పష్టం చేయాలంటూ మంత్రిని అడ్డుకునేందుకు ప్రయత్నించారు. దీంతో పోలీసులు వారిని బలవంతంగా అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సంఘటనలో పోలీసుల విధులకు ఆటంకం కలిగించారంటూ ఎస్ఐ శంకర్ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ సత్యనారాయణ తెలిపారు.

మా గోస ఎవరికి చెప్పుకోవాలి?

● ఎండుతున్న పంటల పొలాలు చూసి రైతు కన్నీరు ● పొలం మధ్యలో పడుకొని తన బాధ వెళ్లబోసుకున్న వైనం




పొలంలో పడుకొని రోదిస్తున్న రైతు నర్సింహ

సూర్యాపేటరూరల్, మార్చి 20: ఆరుగాలం కష్టపడి కంటికి రెప్పలా కాపాడుకున్న పంటలు కళ్లెదుటే ఎండిపోతుంటే రైతుల గోస వర్ణనాతీతంగా మారింది. నీళ్లలేక పంటలు ఎండిపోతుంటే పంటలను చూసి వారు కన్నీళ్లు ఆపుకోలేకపోతున్నారు. వరిపొలం పొట్టకు వచ్చే దశలో పంటకు సాగు నీరు అందక ఎండుతుంటే గోస ఎవరికి చెప్పుకోవాలో తెలియక గుండెలవిసేలా రోదిస్తున్నారు. రైతులు ఎంతో ఆశతో పంటలు సాగు చేస్తే తీరా భూగర్భజలాలు అడుగంటి బోరు బావుల్లో సైతం నీరు రాక దిక్కు తోచని స్థితిలో కన్నీరు మున్నీరవుతున్నారు. సూర్యాపేట జిల్లా సూర్యాపేట మండల పరిధిలోని యర్కారం అవాసప్రాంతమైన దుబ్బతండాకు చెందిన రైతు దరవత్ నర్సింహ పొలానికి సాగునీరు రాకపోవడంతో పొలంలోనే పడుకుని రోదిస్తున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. నర్సింహ తన కున్న 20కుంటల భూమితో పాటు నాలుగు ఎకరాలు కౌలుకు తీసుకుని ఎస్సారెస్పీ కాల్వ నీళ్లతో ఆధారపడి పొలాన్ని సాగుచేస్తున్నాడు. నాలుగు సంవత్సరాలుగా కౌలుకు తీసుకుని కారుకు 20పుట్ల ధాన్యం పండిస్తున్నాడు. ఇప్పుడు ఎస్సారెస్పీ కాల్వ నీరు రాకపోవడంతో పంటకు నీరు అందడం లేదని, తీరా పంట చేతికి వచ్చే సమయంలో సాగునీరు లేకపాయె అని రైతు పొలం వద్దకు వెళ్లినప్పుడల్లా ఎండిపోతున్న పొలాన్ని చూసి రోదిస్తున్నట్లు గ్రామస్థులు తెలిపారు. 'నన్ను ఆదుకునేది ఎవరు... పంట పెట్టుబడికి రూ.50వేలు పెట్టా.. భూయాజమానికి ఎకరానికి రూ.14వేల చొప్పున కౌలు ఎలా చెల్లించాలో అర్థం కావడంలేదు' అని ఆవేదన వ్యక్తం చేస్తున్న వీడియో ఒకటి సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఎస్సారెస్పీ కాల్వ కింది రైతులు పెద్ద మొత్తంలో వరిసాగు చేశారని, వారి పరిస్థితి ఆగమ్యగోచరంగా మరిందని గ్రామస్థులు తెలిపారు.

మర్రిగూడలో కారు బీభత్సం

● అదుపుతప్పి ఇంట్లోకి దూసుకెళ్లిన కారు


ఇంటి ఎదుట షెడ్డులోకి దూసుకెళ్లిన కారు

మర్రిగూడ, మార్చి 20: నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలం వట్టిపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని బట్లపల్లి గ్రామంలో బుధవారం కారు బీభత్సం సృష్టించింది. అదుపుతప్పిన ఆ కారు ఓ ఇంట్లో దూసుకెళ్లింది. ఈ ఘటనలో యువకుడు గాయపడ్డాడు. ఎస్ఐ రంగారెడ్డి, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం... డ్రైవర్ లవంగి కారులో యశ్వంత్ మర్రిగూడ నుంచి నాంపల్లికి వెళ్తున్నాడు. బట్లపల్లి గ్రామానికి చేరుకోగానే అదుపుతప్పిన కారు సమీపంలో ఓ ఇంటి వైపు దూసుకెళ్లి ముందున్న షెడ్డును ధ్వంసం చేసింది. ఆ సమయంలో అక్కడ ముగ్గురు యువకులు ఉన్నారు. వారిలో ఒకరికి గాయాలయ్యాయి. కారు అతివేగంగా దూసుకెళ్లడంతో రేకుల షెడ్ పూర్తిగా ధ్వంసమైంది. షెడ్డులో ఉన్న రెండు బైకులు కూడా ధ్వంసమైయ్యాయి. కారు తగలడంతో ఇంటి పక్కనే ఉన్న విద్యుత్ స్తంభం కూడా ఒరిగింది. కారు డ్రైవర్ అతివేగంగా రావడంతో ఈ సంఘటన జరిగిందని ఎస్ఐ రంగారెడ్డి, గ్రామస్తులు తెలిపారు. ఇంటి యజమాని మాదగోని వెంకటయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కిడ్నాపర్ అనుకొని కూలీని వెంబడించి..

● భయంతో పరుగెత్తి హల్‌చల్ చేసిన కూలీ


కూలీని అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

మోత్కూరు, మార్చి 20: రోడ్డు పనికి వచ్చిన కూలీని కిడ్నాపర్‌గా అనుమానించిన గ్రామస్థులు అతన్ని వెంబడించగా పోలీసులు అదుపులోకి తీసుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మండలం అనాజీపురంలో బుధవారం ఈ సంఘటన జరిగింది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. అనాజిపురం వద్ద వలిగొండ-తొర్రూరు జాతీయ రహదారి పనులు జరుగుతున్నాయి. సికింద్రాబాదు రైల్వే స్టేషన్‌లో బిక్షమెత్తుకుంటున్న ఒడిస్సా రాష్ట్రానికి చెందిన సహదేవ్ అనే వ్యక్తిని రోడ్డు లేబర్ కాంట్రాక్టర్ జయకృష్ణ నిర్మాణ పనులు చేసేందుకు కూలీగా తీసుకువచ్చాడు. వారం రోజులుగా అనాజిపురంలో రోడ్డు పనిచేస్తున్న సహదేవ్ గ్రామంలోని బుడిగజంగాల కాలనీకి వెళ్లగా కొత్త వ్యక్తి కావడంతో కుక్క మొరిగింది. దీంతో కాలనీవాసులు ప్రశ్నించగా అతనికి తెలుగు రాక, కాలనీవాసులు అడిగేది అతనికి అర్థం కాకపోవడంతో చిన్న పిల్లలను ఎత్తుకెళ్లే కిడ్నాపర్‌గా అనుమానించిన కాలనీవాసులు పట్టుకునే ప్రయత్నం చేశారు. తనను కొడతారేమోనన్న భయంతో సహదేవ్ పరుగెత్తడంతో కాలనీవాసులు, గ్రామస్థులు వెంబడించారు. పరుగెత్తుతూనే తనను వెంబడిస్తున్న ప్రజలను బెదిరిస్తూ ఓ ప్రజాప్రతినిధి గెస్ట్‌హౌస్ ఆవరణలోకి వెళ్లి గేటు మూసి లోపల గడియ వేసుకున్నాడు. తోట పనికి ఉపయోగించేందుకే అక్కడ ఉంచిన కర్ర, కత్తి, ఇనుపరాడ్‌తో ప్రజలను బెదిరించాడు. సమాచారం తెలిసిన పోలీసులు ప్రహరీ గోడపైనుంచి ఆవరణలోకి దిగి సహదేవ్‌ను అదుపులోకి తీసుకుని విచారించారు. విషయం తెలుసుకున్న రోడ్డు లేబర్ కాంట్రాక్టర్ అక్కడికి చేరుకుని కూలి పనుల నిమిత్తం తానే తీసుకువచ్చినట్లు వివరించటంతో అతనితోపాటు పంపారు. ఈ సందర్భంగా ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ భాష తెలియక పోవడంవల్లే ఇదంతా జరిగిందన్నారు. ఈ ప్రాంతంలో కిడ్నాపర్లెవరూ సంచరించడం లేదని, కిడ్నాపర్లు తిరుగుతున్నారన్న వదంతులను నమ్మవద్దన్నారు. అలాంటిదేమైనా ఉంటే తామే ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు.

లీడ్ క్యాప్ భూములను పరిరక్షించాలి



డీఆర్‌వోకు వినతిపత్రం అందజేస్తున్న సమితి నాయకులు

నల్లగొండ టౌన్, మార్చి 20 : జిల్లాలో లెదర్ పరిశ్రమ కోసం కేటాయించిన లీడ్‌క్యాప్ భూములను పరిరక్షించాలని తెలంగాణ మాదిగ చర్మకారులు, లెదర్ పరిశ్రమల భూముల(లీడ్‌క్యాప్)దళిత అసైన్డ్ భూముల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో బుధవారం జిల్లా రెవెన్యూ అధికారి రాజ్యలక్ష్మీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సమితి రాష్ట్ర అధ్యక్షుడు కూసపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ 2003లో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం లెదర్‌పరిశ్రమ కోసం లీడ్ క్యాప్ సంస్థ ద్వారా రాష్ట్రంలోని తొమ్మిది జిల్లాలో భూములను కేటాయించారన్నారు. అందులో జిల్లాలోని దండెంపల్లిలో 24 ఎకరాల భూమి కూడా ఒకటన్నారు. మాదిగ కులానికి చెందిన యువతీ యువకులు చెప్పుల తయారీ, బూట్లు కుట్టుట వంటి వాటికోసం శిక్షణా సంస్థతో పాటు లెదర్‌పరిశ్రమను నెలకొల్పాలని సంకల్పించారన్నారు. అందుకోసం ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ కింది రూ.300 కోట్లు కూడా కేటాయించారని గుర్తు చేశారు. కాని గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా పరిశ్రమ కాస్తమరుగున పడిందన్నారు. భూములు సైతం అన్యాక్రాంతం అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వ భూములను పరిరక్షించి పేదలకు న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో సమితి రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఏకు సారయ్య, ఉపాధ్యక్షుడు బొజ్జ సైదులు, సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు గ్యార ఇంద్రమోహన్, మనోజ్ పాల్గొన్నారు.

గోపి స్ఫూర్తితో సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలి



గోపి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీఐటీయూ నాయకులు

నల్లగొండ రూరల్, మార్చి 20 : ఉమ్మడి నల్లగొండ జిల్లా ఉద్యమ నాయకుడు తిరందాసు గోపి స్ఫూర్తితో సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చినపాక లక్ష్మీనారాయణ, తుమ్మల వీరారెడ్డి పిలుపునిచ్చారు. గోపి 7వ వర్ధంతి సందర్భంగా బుధవారం స్థానిక దొడ్డి కొమరయ్య భవనంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో నిర్వహించిన అనేక కార్మిక సమ్మె పోరాటాల్లో ముఖ్యమైన పాత్ర నిర్వహించిన గొప్ప కార్మిక నాయకుడని కొనియాడారు. కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర నాయకులు బండా శ్రీశైలం, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి పాలడుగు నాగార్జున, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎండీ సలీం, బాణాల పరిపూర్ణాచారి, దండంపెల్లి సత్తయ్య పాల్గొన్నారు.

ఇంటర్ సర్కిల్ క్రీడల్లో జిల్లాకు ప్రథమస్థానం



క్రీడాపోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యుత్ ఉద్యోగులతో ఎస్ఈ చంద్రమోహన్

నల్లగొండ టౌన్, మార్చి 20 : తెలంగాణ ట్రాన్స్‌కో అండ్ డిస్కం ఇంటర్ సర్కిల్ క్రీడల్లో జిల్లాకు చెందిన విద్యుత్ క్రీడాకారులు సత్తాచాటారు. ఈ నెల 12 నుంచి 14 వరకు నిర్వహించిన టగ్‌ఆఫ్‌వార్‌లో జిల్లా జట్టు ప్రథమస్థానం సాధించింది. అదేవిధంగా అథ్లెటిక్ షార్ట్‌పుట్, జావెలిన్‌త్రో విభాగాల్లో కూడా జిల్లా క్రీడాకారులు ప్రతిభ కనబరిచారు. జావెలిన్ త్రో విభాగంలో ఏ సువర్ణ ప్రథమస్థానంతో పాటు 100 మీటర్ల పరుగుపందెంలో ద్వితీయ స్థానం సాధించింది. లాంగ్‌జంప్‌లో సూర్యాపేట జిల్లాకు చెందిన జే సంధ్య ప్రథమస్థానంలో నిలవగా మొత్తంగా ఉమ్మడి నల్లగొండ జిల్లా ఓవరాల్ ఛాంపియన్‌షిప్ సాధించింది. క్రీడల్లో గెలుపొందిన ఉద్యోగులు బుధవారం ఎస్ఈ చంద్రమోహన్‌ను కలిసి ట్రోఫీలను అందజేసి, ఆయన వారికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ జనరల్ సెక్రటరీ తిరుగుడు శ్రీనివాస్, క్రీడాకారులు ఉమాదేవి, స్వరూపారాణి, సువాలి భాయ్, శ్రీదేవి, సంధ్య, రవళి, ఉమా, రోజా, చిట్యాల రాజు తదితరులున్నారు.

కారు ఢీకొని ఆటోడ్రైవర్ మృతి



దేవేందర్(ఫైల్)

గుర్రంపోడు, మార్చి 20 : కారు ఢీకొని ఆటో డ్రైవర్ దుర్మరణం చెందాడు. ఈ సంఘటన ముల్కలపల్లి గ్రామసమీపంలో మంగళవారం అర్ధరాత్రి జరిగింది. ఎస్ఐ శివప్రసాద్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నాంపల్లి మండలం చామలపల్లి గ్రామానికి చెందిన దాసరి దేవేందర్(23) ఆటోనడుపుతూ జీవనం కొనసాగిస్తున్నాడు. గుర్రంపోడు మండలం పాల్వాయి గ్రామంలో ఇటీవల జరిగిన దేవాలయ వేడుకల అనంతరం బంధువులు దేవేందర్ స్వగ్రామం చామలపల్లికి వచ్చారు. వారిని పాల్వాయి గ్రామంలో విడిచిపెట్టి స్వగ్రామానికి వస్తుండగా హైదరాబాద్ నుంచి వస్తున్న కారు ఎదురుగా ఢీ కొట్టడంతో ఆటో పల్టీలు కొట్టి దేవేందర్ అక్కడికక్కడే మృతిచెందాడు. దేవేందర్‌కు భార్య, కుమారుడు ఉన్నారు. భార్య గౌతమి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివప్రసాద్ తెలిపారు.

దేవరకొండలో

దేవరకొండ, మార్చి 20: మండలంలోని పద్మట్‌పల్లి వద్ద బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఎల్లారెడ్డిబావికి చెందిన సాయిలు(60) భార్య జంగమ్మకు ఆరోగ్యం బాగలేకపోవడంతో పద్మట్‌పల్లిలో ఆర్ఎంపీ డాక్టర్ వద్దకు తీసుకువచ్చాడు. చికిత్స అనంతరం మోపెడ్‌పై స్వగ్రామానికి వెళ్తుండగా జడ్చర్ల నుంచి ఎదురుగా వస్తున్న కారు టీవీఎస్‌ను ఢీకొనడంతో గాయాలై సాయిలు అక్కడికక్కడే మృతి చెందాడు. భార్య జంగమ్మకు స్వల్పగాయాలయ్యాయి. ప్రమాదంపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని దేవరకొండ సీఐ నర్సింహులు తెలిపారు.

డీసీఎం బోల్తా : డ్రైవర్‌కు గాయాలు

నాగార్జునసాగర్, మార్చి 20 : సాగర్ హిల్‌కాలనీలో మిర్చి లోడుతో వెళ్తున్న డీసీఎం బోల్తా పడిన ఘటనలో డ్రైవర్‌కు గాయాలయ్యాయి. రాష్ట్రం నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు మిర్చి మార్కెట్ యార్డుకు లోడుతో వెళ్తున్న డీసీఎం సాగర్ రెండో ఘాట్ బుద్ధవనం వద్ద అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ఘటనలో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటనపై ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

మూడు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

శాలిగౌరారం, మార్చి 20: మండలంలోని వంగమర్తి మూసీ వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న 3 ట్రాక్టర్లను పట్టుకుని సీజ్ చేసినట్లు ఎస్ఐ వాసా ప్రవీణ్‌కుమార్ తెలిపారు. అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్ల యజమానులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఆయన తెలిపారు.

ఉత్సవాలకు ఆలయాలు ముస్తాబు



కొండచరిల్లోని శివలింగం, ఆలయ కొండపైకి ముఖద్వారం

నిడమనూరు, మార్చి 20: మండలంలోని ఎర్రబెల్లి గ్రామంలోని శ్రీలింగమంతులస్వామి జాతరను ఈ నెల 23 నుంచి 26 వరకు నిర్వహించనున్నారు. యాదవుల ఆరాధ్య దైవం లింగమంతులస్వామి జాతరను ప్రతీ రెండేళ్లకు ఒకసారి ఘనంగా నిర్వహిస్తారు. ఈ జాతర రెండో పెద్ద గట్టు జాతరగా ప్రసిద్ధి. ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచే కాకుండా ఏపీలోని కృష్ణా, గుంటూరు జిల్లాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివస్తారు. ఆలయం వద్ద భక్తులకు పలు వసతులు కల్పించారు. నిడమనూరు, హాలియా, మిర్యాలగూడ, దేవరకొండ, నల్లగొండ నుంచి ఎర్రబెల్లికి జాతర సందర్భంగా ప్రత్యేక బస్సులు నడపనున్నారు.

● ఈ నెల 23వ తేదీ శనివారం రాత్రి మంద గంపలతో స్వామి వారికి ప్రదక్షిణతో జాతర ప్రారంభం అవుతుండగా, 24న తల్లిగంప, తెల్లవారుజామున లింగమంతులస్వామి, మాణిక్యాలదేవి కళ్యాణ మహోత్సవం నిర్వహిస్తారు. 25న నైవేద్యం సమర్పించుట, యలమంచమ్మ బోనాల సమర్పణతో పాటు 26న మాణిక్యాలదేవి గొర్రెల మంద ప్రవేశం కార్యక్రమాలు నిర్వహిస్తారు.


ఆలయ చరిత్ర

ఎర్రబెల్లిలోని లింగమంతులస్వామికి ఘనమైన చరిత్ర ఉంది. వందల ఏళ్ల క్రితమే శివుడు పార్వతీదేవిని వివాహమాడేందుకు లింగమంతులస్వామి రూపంలో ఎర్రబెల్లి సమీపంలోని గుట్టపై బండ చెరికలో వెలిశాడని భక్తుల నమ్మకం. స్వామి వెలసిన తీరుపై అనేక కథనాలు ప్రచారంలో ఉన్నాయి. చెంచు వనిత మాణిక్యాలదేవిని గొర్రెలకాపరి రూపంలో ఉన్న లింగం(శివుడు) పెళ్లి చేసుకోవాలనుకుంటాడు. కానీ మాణిక్యాలదేవి అందుకు తిరస్కరిస్తుంది. ఎలాగైనా ఆమెను పెళ్లి చేసుకోవాలని శివుడు మాయోపాయం పన్నుతాడు. చెంచు సైన్యం నివాసముంటున్న గుడారంపై దాడి జరుగుతుంది. శివుడితో పోరాడి చివరకు మాణిక్యాలదేవి లొంగిపోవడంతో ఇరువురికి కళ్యాణం జరుగుతుంది. అప్పటి నుంచి ఎర్రబెల్లి కొండచరియ వద్ద జాతరను నిర్వహిస్తున్నారన్న కథనం ప్రాచుర్యంలో ఉంది.

జాతరకు భారీ ఏర్పాట్లు : మసిముక్కు మట్టయ్య, ఆలయ చైర్మన్

ఎర్రబెల్లిలోని లింగమంతులస్వామి జాతరను ఈ పర్యాయం ఎంతో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లుచేస్తున్నాం. నాలుగు రోజుల పాటు వైభవంగా నిర్వహించే తిరునాళ్లకు భక్తులు పెద్దసంఖ్యలో తరలివస్తారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేస్తున్నాం.

నేటి నుంచి వేంకటేశ్వర స్వామి జాతర



ముప్పారం గ్రామంలో శాలివాహనుల కాలం 1122లో రాతిస్తంభాలతో నిర్మించిన శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 21 నుంచి 26 వరకు బ్రహ్మోత్సవాలు జరుగనున్నాయి. ఆరు రోజుల పాటు నిర్వహించే ఉత్సవాలకు నిర్వాహకులు ఆలయాన్ని ముస్తాబుచేశారు. గురువారం స్వామివారు చినకోవేల నుంచి పెదకోవేలకు చేరుకుంటారు. 22న గరుడసేవ, పరమపద ఉత్సవం, 23న చాత్మర, అంకురారర్పణ, 24న గరుడముద్ద, 25న ఎదుర్కోళ్లు, అనంతరం స్వామివారి తిరుకల్యాణం కన్నుల పండువగా నిర్వహిస్తారు. సాయంత్రం కల్యాణమూర్తులను గ్రామంలో ఊరేగిస్తారు. 26న పూర్ణాహుతి, చక్రస్నానంతో ఉత్సవాలు ముగుస్తాయి. కాగా హోలీ పర్వదిన రోజున స్వామివారి కల్యాణం నిర్వహించడం ఇక్కడ ఆనవాయితీ. మేరెడ్డి వంశీయులే గతేడాది వరకు ప్రతి ఏటా ఉత్సవాలను నిర్వహించేవారు. మొదటిసారిగా యడవెల్లి వంశానికి చెందిన యడవెల్లి విజయ్‌కుమార్‌రెడ్డిని చైర్మన్‌గా ప్రభుత్వం నియమించింది. ఈ ఏడాది ఆయన ఆధ్వర్యంలోనే ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఆయన తెలిపారు.

వైభవంగా బ్రహ్మోత్సవాలు

గ్రామంలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో నేటి నుంచి ఆరు రోజుల పాటు బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తాం. ఉత్సవాల్లో భాగంగా 25న స్వామివారి కల్యాణం కన్నుల పండువగా జరుగుతుంది. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి ఉత్సవాల్లో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలి.

● యడవెల్లి విజయ్‌కుమార్‌రెడ్డి, ఆలయ చైర్మన్

ప్రతి ఒక్కరూ దైవభక్తి కలిగి ఉండాలి: మంత్రి



గూడూరు, వెంకటాద్రిపాలెం, మాచనపల్లి గ్రామాల్లోని ఆలయాల్లో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి

మిర్యాలగూడ రూరల్, మార్చి 20 : దైవభక్తితో మానసిక ప్రశాంతత లభిస్తుందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని గూడూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీసీతారామాంజనేయస్వామి ఆలయంలో, వెంకటాద్రిపాలెంలో పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామివారి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డితో కలిసి స్వామివార్లకు నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆలయాల అభివృద్ధికి తనవంతుగా కృషి చేస్తానన్నారు. మంత్రి వెంట డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనను కలిగి ఉండాలి: మండలి చైర్మన్ గుత్తా

ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను కలిగి ఉండాలని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. వెంకటాద్రిపాలెం గ్రామంలో పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవానికి మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావుతో కలిసి ప్రత్యేకపూజల్లో పాల్గొన్నారు. కులమతాలకు అతీతంగా భక్తి భావంతో మెలగాలన్నారు. కార్యక్రమంలో రైతుబంధు సమితి జిల్లా మాజీ అధ్యక్షులు చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర ఆగ్రోస్ మాజీ చైర్మన్ తిప్పన విజయసింహారెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నాగార్జునచారి తదితరులు పాల్గొన్నారు.

మాచనపల్లిలో...

మాడ్గులపల్లి: దేవాలయాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని మాచనపల్లి గ్రామంలో సీతారామచంద్రస్వామి దేవాలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠా మహోత్సవానికి హాజరయ్యారు. ఆయన వెంట జడ్పీటీసీ పాశం రాంరెడ్డి, నాయకులు పాల్గొన్నారు. అదేవిధంగా మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కంచర్ల కృష్ణారెడ్డితో కలిసి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ధర్మాన్ని, సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత యువతపై ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, నల్లగొండ మునిసిపల్ మాజీ చైర్మన్ మందడి సైదిరెడ్డి, బీఆర్ఎస్ నల్లగొండ పట్టణ అధ్యక్షుడు బోనగిరి దేవేందర్, సంధినేని జనార్ధన్‌రావు, మెరుగు గోపి, దాసరి జానయ్య, మర్రి మదన్, శ్రీను, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రేగట్టెలో ఘనంగా శంకరస్వామి రథోత్సవం

కనగల్: మండలంలోని రేగట్టె గ్రామంలో శ్రీభవానీ శంకరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రథోత్సవాన్ని నిర్వహించారు. గ్రామస్తులు రథాన్ని లాగుతూ గ్రామవీధుల్లో ఊరేగించారు.ఆలయంలో రుద్రహోమం, పూర్ణాహుతి, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ఆలయ చైర్మన్ గంజి చంద్రమౌళి, కార్యదర్శి దొమ్మాటి అంజయ్య, కర్నాటి శ్రీనివాసులు, గంజి ముత్యాలు, కారింగు సతీష్, తిరందాసు రామలింగం, లక్ష్మయ్య, వెంకటేశం, పిచ్చయ్య, విజయ్ నర్సింహ పాల్గొన్నారు.

దైవచింతనతో సన్మార్గం

చిట్యాల రూరల్: ప్రతి ఒక్కరూ కుటుంబసభ్యులతో ఆలయాలను సందర్శించాలని దైవచింతనతో సన్మార్గం అలవడుతుందని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. మండలంలోని పెద్దకాపర్తి శివారులో గుట్టపైన కొలువైన తిరుమలనాథస్వామి ఆలయంలో ఉత్సవాల్లో భాగంగా బుధవారం నిర్వహించిన రథోత్సవంలో ఎమ్మెల్యే వీరేశం పాల్గొన్నారు. ఆయన వెంట ఆలయ కమిటీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణకు ప్రజలు సహకరించాలి



దేవరకొండలో కవాతు నిర్వహిస్తున్న కేంద్ర బలగాలు, స్థానిక పోలీసులు

దేవరకొండ, మార్చి 20: పార్లమెంట్ ఎన్నికలు సజావుగా సాగేందుకు అందరూ సహకరించాలని దేవరకొండ డీఎస్పీ గిరిబాబు అన్నారు. పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తుండటంతో దేవరకొండలో బుధవారం కేంద్ర పోలీస్ బలగాలతో కలిసి స్థానిక పోలీసులు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ సమస్యాత్మకమైన గ్రామాలను గుర్తించి పోలీస్ నిఘా ఉంచామన్నారు. కార్యక్రమంలో దేవరకొండ సీఐ నర్సింహులు, కేంద్ర పోలీస్ సీఆర్‌పీఎఫ్ అధికారులు, డివిజన్ పరిధిలోని మండలాల ఎస్ఐలు, పోలీసులు పాల్గొన్నారు.

ముమ్మరంగా తనిఖీలు చేపట్టాం

దామరచర్ల/అడవిదేవులపల్లి : ఎన్నికల కోడ్ నేపథ్యంలో చెక్‌పోస్టుల వద్ద ముమ్మరంగా తనిఖీలు చేపట్టామని ఆర్డీవో జీ శ్రీనివాస్‌రావు అన్నారు. బుధవారం రాష్ట్ర సరిహద్దు వాడపల్లి వద్ద ఏర్పాటుచేసిన చెక్‌పోస్టును ఆయన పరిశీలించి, మాట్లాడారు. అనంతరం ఆయన వివిధ శాఖల అధికారులతో మాట్లాడారు. ఆయన వెంట తహసీల్దార్ జవహర్‌లాల్ ఉన్నారు. అదేవిధంగా అడవిదేవులపల్లి మండలకేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని ఆర్డీవో శ్రీనివాస్‌రావు పరిశీలించారు. అనంతరం విద్యార్థుల మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి నాణ్యమైన భోజనం అందించాలని ఆదేశించారు. ఆయన వెంట ఎంపీడీవో కరుణాకర్‌రావు, తహసీల్దార్ సురేష్, హెచ్ఎం అబ్బాస్ అలీ, సీనియర్ అసిస్టెంట్ అమీర్‌అలీ, కార్యదర్శి వాసు పాల్గొన్నారు.

ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలి

శాలిగౌరారం : పార్లమెంటు ఎన్నికల నాటికి అర్హులైన వారందరినీ ఓటరు జాబితాలో చేర్చేందుకు ఎన్నికల సంఘం మరో అవకాశం కల్పించిందని తహసీల్దార్ ఎండీ అన్వర్‌హుస్సేన్ తెలిపారు. ఈ ఏడాది ఏప్రిల్ 1 నాటికి 18 ఏళ్లు నిండిన వారంతా నూతనంగా ఓటు హక్కు కోసం వచ్చే నెల 15 వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకోవాలి

కొండమల్లేపల్లి, మార్చి 20 : గర్భిణులు, బాలింతలు పోషకాహారాన్ని తీసుకోవాలని సీడీపీవో ఉదయ అన్నారు. కొండమల్లేపల్లి గ్రామపంచాయతీ సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం నిర్వహించిన పోషణ పక్ష కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ తిప్పర్తి రాధ, పంచాయతీ కార్యదర్శి గిరిజ, జయేందర్, సురేష్ పాల్గొన్నారు.

గట్టుప్పల్: మండలంలోని ధర్మతండాలో నిర్వహించిన పోషక్ పక్వాడ్ వారోత్సవంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శివేష, అంగన్‌వాడీ టీచర్ అంజిబాయి పాల్గొన్నారు.

చిట్యాలరూరల్ : మండలంలోని చిన్నకాపర్తిలోని అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో జయలక్ష్మి, శోభారాణి, విజయలక్ష్మి, లింగమ్మ, హేమలత తదితరులు పాల్గొన్నారు.

గుర్రంపోడు : గర్భిణులు పోషకాహారం తీసుకోవాలని ఎంపీడీవో మంజుల అన్నారు. పోషణ పక్షం కార్యక్రమంలో భాగంగా మండలంలోని జిన్నాయిచింత గ్రామంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ప్రమీల, ప్రధానోపాధ్యాయుడు ముదస్సిర్, ఏఎన్ఎం విమల, కార్యదర్శి స్వీటీ, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా: ఎమ్మెల్యే



నకిరేకల్‌లో పీపుల్స్ క్వశ్చన్ అవర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీరేశం

నకిరేకల్, మార్చి 20: నకిరేకల్ నియోజకవర్గాన్ని అభివృద్ధిలో రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. నకిరేకల్‌లో బుధవారం నిర్వహించిన పీపుల్స్ క్వశ్చన్ అవర్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం 100 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రజలు, నాయకులు అడిగిన 100 ప్రశ్నలకు ఆయన సమాధానాలు చెప్పారు. నకిరేకల్ నియోజకవర్గ వ్యాప్తంగా అన్నివిధాలుగా అభివృద్ధి చేసేందుకు నిరంతరం కృషి చేస్తున్నానని, ప్రజలు కోరుకుంటున్న అభివృద్ధి తన లక్ష్యమన్నారు. కార్యక్రమంలో బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పూజర్ల శంభయ్య, ఎంపీపీ బచ్చుపల్లి శ్రీదేవి, గంగాధర్‌రావు, కౌన్సిలర్ గాజుల సుకన్య, పన్నాల రాఘవరెడ్డి, సకినాల రవి, పన్నాల శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పుస్తకపఠనంతో విజ్ఞానం : కూరెళ్ల

చిట్యాల రూరల్, మార్చి 20 : పుస్తకపఠనంతోనే విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చని పద్మశ్రీ అవార్డు గ్రహీత, సాహితీవేత్త కూరెళ్ల విఠలాచార్య అన్నారు. మండలంలోని గుండ్రాంపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు బుధవారం రామన్నపేట మండలం వెల్లంకిలోని కూరెళ్ల విఠలాచార్య గ్రంథాలయాన్ని సందర్శించి, ఆయన్ను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నతనం నుంచే పుస్తక పఠనం అలవరచుకోవాలన్నారు. గ్రంథాలయంలో విద్యార్థులు కలియతిరిగి వివిధరకాల పుస్తకాల గురించి తెలుసుకున్నారు. అనంతరం పుస్తకాల విశిష్టతను విద్యార్థులకు విఠలాచార్య వివరించారు.

సాగర్‌లో భారీగా పేలుడు పదార్థాలు స్వాధీనం



నాగార్జునసాగర్‌లో స్వాధీనం చేసుకున్న పేలుడు పదార్థాలతో డీఎస్పీ రాజశేఖర్‌రాజు

నాగార్జునసాగర్, మార్చి 20: నాగార్జునసాగర్ అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద పోలీసులు భారీగా పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్‌రాజు పర్యవేక్షణలో సీఐ బీసన్న, ఎస్ఐ సంపత్ ఇతర పోలీసు సిబ్బంది వాహన తనిఖీలు చేపట్టారు. అదే సమయంలో బుధవారం ఉదయం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మార్కాపురం నుంచి హైదరాబాద్‌లోని నార్సింగికి వెళ్తున్న ఏపీ02 8272 నెంబర్ గల వ్యాన్‌ను తనిఖీచేయగా, ఎటువంటి ఆధారాలు లేని 1,450కిలోల జిలెటిన్ స్టిక్స్, 3,000 మీటర్ల పొడవున్న సేఫ్టీ ఫ్యూజ్‌ను తరలిస్తున్నట్లు గుర్తించారు. పేలుడు సామాగ్రి తరలిస్తున్న వాహనానికి అనుమతి కూడా లేనట్లు గుర్తించారు. డ్రైవర్ నాగేంద్రబాబును అదుపులోకి తీసుకుని విచారణ నిమిత్తం విజయపురి టౌన్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పేలుడు పదార్థాల చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలను త్వరలో వెల్లడిస్తామని డీఎస్పీ తెలిపారు.

102 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

శాలిగౌరారం, మార్చి 20 : డీసీఎం వాహనంలో తరలిస్తున్న 102 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పోలీసులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. మాదారం గ్రామానికి చెందిన కట్టా ప్రవీణ్, కూల్సోతు నరేష్‌కు 102 క్వింటాళ్ల రేషన్ బియ్యం విక్రయించాడు. ఆ బియ్యాన్ని నరేష్ 211బస్తాల్లో డీసీఎం వాహనంలో బుధవారం తెల్లవారుజామున హైదరాబాద్‌కు తరలిస్తుండగా మండలంలోని చొల్లగూడెం స్టేజీ వద్ద పోలీసులు పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. బియ్యాన్ని పరిశీలించిన డిప్యూటీ తహసీల్దార్ జ్యోతి పంచనామా రాశారు. ఎస్ఐ వాసా ప్రవీణ్‌కుమార్ కేసు నమోద చేసుకుని డీసీఎం వాహనాన్ని సీజ్ చేసి నిందితులు కూల్సోతూ నరేష్, కట్టా ప్రవీణ్‌లపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపించారు.

కేఎన్ఎం డిగ్రీ కళాశాలకు రూ.5 కోట్లు

మిర్యాలగూడ టౌన్, మార్చి 20 : పట్టణంలోని కేఎన్ఎం ప్రభుత్వ కళాశాలకు ప్రధానమంత్రి ఉచ్ఛత్ సర్వశిక్షా అభియాన్(పీఎం ఉష) పథకం కింద రూ.5కోట్లు మంజూరయ్యాయి. అరకొర వసతులతో ఉన్న కళాశాలలో అదనపు తరగతి గదులు, ఆధునిక వసతులతో గ్రంథాలయం, విశాలమైన క్రీడామైదానం, సెమినార్ హాల్, వాష్‌రూమ్స్ ఏర్పాటుకు నిధులు వినియోగించనున్నారు. గుంటూరు రోడ్డు నుంచి కళాశాల వరకు రహదారిని విస్తరణతో పాటు ఇరువైపులా గ్రీనరీ పెంచేలా ప్రణాళికలు రూపొందించారు. ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ విభాగాలకు గదుల నిర్మాణం చేయనున్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులు, అందరి సహకారంతో కళాశాలను అభివృద్ధి చేస్తామని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బిక్షమయ్య తెలిపారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలి

నల్లగొండ రూరల్, మార్చి 20 : రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రైతులు బోర్ల కింద సాగు చేసిన పంటను కోతలు కోశారని, ఇప్పటికే వర్షాల్లేక పొలాలు ఎండిపోయి రైతులకు తీవ్రంగా నష్టం వాటిల్లిందన్నారు. చేతికందిన కొద్దిపాటి ధాన్యాన్ని నిల్వ చేసుకునేందుకు గోదాంలు లేక పొలాల వద్దే ఉన్నాయని, అకాల వర్షాలతో ధాన్యం తడిసి దెబ్బతినే అవకాశం ఉందన్నారు. ఈ పరిస్థితుల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే మద్దతు ధరని ప్రకటించి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలన్నారు. అదేవిధంగా జిల్లాస్థాయిలో రాజకీయ పార్టీలు, రైతు సంఘాలు, మిల్లర్లతో సమావేశం ఏర్పాటు చేయాలని కలెక్టర్‌ను కోరారు.

సీఎం పీఆర్వోను కలిసిన నాయకులు

మిర్యాలగూడ టౌన్, మార్చి 20 : సీఎం పీఆర్వోగా బాధ్యతలు స్వీకరించిన మిర్యాలగూడ నియోజకవర్గ వాసి శ్రీనివాసరావుకు శుభాకాంక్షలు తెలిపినట్లు బీసీ సంక్షేమ సంఘ రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ తెలిపారు. సచివాలయంలో శ్రీనివాసరావును కలిసి పుష్పగుచ్ఛం అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో గుంటి మహేష్, రవి, వీటి తదితరులు పాల్గొన్నారు.

బాలునాయక్‌కు మంత్రివర్గంలో చోటు కల్పించాలి

కొండమల్లేపల్లి: రాష్ట్ర మంత్రివర్గంలో దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్‌కు స్థానం కల్పించాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఉట్కూరి వేమన్‌రెడ్డి కోరారు. బుధవారం మండలకేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గిరిజన ప్రాంతమైన దేవరకొండ నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందాలంటే బాలునాయక్‌కు మంత్రిగా అవకాశం ఇవ్వాలన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సిరాజ్‌ఖాన్, కైసర్‌ఖాన్, పెద్దిశెట్టి సుధాకర్, నీలం శ్రీనివాస్, బక్కులు, బోడ అశోక్‌యాదవ్ పాల్గొన్నారు.

పార్కింగ్ ఫీజులను తిరిగి స్వాధీనం చేసుకోవాలి

కొండమల్లేపల్లి: కొండమల్లేపల్లి పశువుల సంతకు సంబంధించి 2023 జూన్ నుంచి 2024 మార్చి వరకు అనుమతులు లేకుండా పార్కింగ్‌ఫీజు వసూలు చేయడంపై పలువురు యువకులు బుధవారం పంచాయతీ కార్యదర్శి వీరబాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనధికారికంగా పార్కింగ్ ఫీజు వసూలు చేశారని, వసూలు చేసిన ఫీజును రికవరీ చేసి పంచాయతీ అభివృద్ధికి వినియోగించాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో అందుగుల వెంకటేష్, ఓర్సు శ్రీను, బుడిగపాక కోటయ్య తదితరులు ఉన్నారు.

రాష్ట్ర ప్రయోజనాలే బీఆర్ఎస్ అభిమతం

మర్రిగూడ, మార్చి 20: తెలంగాణ ప్రయోజనాలే బీఆర్ఎస్ అభిమతమని రైతుబంధు సమితి మండల మాజీ కన్వీనర్ బచ్చు రామకృష్ణ అన్నారు. బుధవారం మండలకేంద్రంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్‌కు గెలుపు, ఓటములు కొత్తేమీ కాదన్నారు. పార్టీని వీడిపోతున్న నాయకులతో పార్టీకి ఎలాంటి నష్టంలేదన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులే సత్తా చాటుతారన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు చెరుకు శ్రీరాములుగౌడ్, గోపీనాయక్, గ్రామశాఖ అధ్యక్షుడు రాపోలు యాదగిరి, జంపాల జయప్రసాద్, కుక్కల మహేందర్, మల్లేష్, కొండాపురం నరేష్ తదితరులు ఉన్నారు.

పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్యశిబిరం

కొండమల్లేపల్లి: మండలంలోని పెండ్లిపాకల గ్రామంలో కొండమల్లేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. పరీక్షల అనంతరం అవసరమైన వారికి మందులను అందజేసినట్లు మండల వైద్యాధికారి ఉషారాణి తెలిపారు.

కనగల్ మండల వాసులకు ఉత్తమసేవా అవార్డులు

కనగల్, మార్చి 20: మండలానికి చెందిన ఇద్దరు ఉత్తమ సేవా అవార్డులు అందుకున్నారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఆలూరి కల్చర్ సోషల్ ఆర్గనైజేషన్ ఫ్రెండ్‌షిప్, తెలంగాణ భాషా, సాంస్కృతిక శాఖ బుధవారం సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో మండల కేంద్రానికి చెందిన సామాజిక సేవా కార్యకర్త కంబాల శివలీలారెడ్డి, బుడుమర్లపల్లి గ్రామానికి చెందిన ఆర్ఎంపీ బిచ్చాల మహేష్ అందుకున్నారు. ఈ అవార్డులను అల్లూరి విల్సన్, సినీనటుడు మాణిక్‌రావు, సినీ నిర్మాత గుర్రపు విజయ్‌కుమార్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీతలు మాట్లాడుతూ అవార్డులను అందుకోవటం సంతోషంగా ఉందన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు కోసం పనిచేయాలి

నార్కట్‌పల్లి: పార్లమెంట్ ఎన్నికల్లో భువనగిరి స్థానంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపుకోసం బూత్ కమిటీలు ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని కాంగ్రెస్ ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు పాశం శ్రీనివాస్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలో బూత్ కమిటీల ఏర్పాటు సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ఐదు న్యాయాలు..ఆరు గ్యారెంటీలను ప్రజలకు వివరించాలని సూచించారు. సమావేశంలో పార్టీ నాయకులు ఐతరాజు యాదయ్య, జెరిపోతుల భరత్, పుల్లెంల అచ్చాలు, సట్టు సత్తయ్య, రాధారపు బిక్షపతి, వడ్డేగోని రామలింగం, ప్రజ్ఞాపురం సత్తి, ఇడుకుళ్ల బిక్షమయ్య, సల్లా వాసుదేవ్, రుద్రోజు శేఖర్, ఎంఏ అజీజ్, వేముల నర్సింహ, పుల్లెంల లింగయ్య, మాదాసు నరేష్ పాల్గొన్నారు.